సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



రావి నారాయణరెడ్డికి నివాళి
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. - 9లో



కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి
కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని, గ్రామాలు బాగుపడ్డాయని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. - 9లో



4 నెలలు కష్టపడితే అధికారం
నాలుగు నెలలు ఐక్యంగా కష్టపడితే రాష్ట్రంలో అధికారం ఖాయమని మాజీ మంత్రి జానారెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



భూదాన్‌పోచంపల్లి చెరువును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీసీపీ, అడిషనల్ డీసీపీ

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని చెరువును గురువారం ఇన్‌చార్జ్ డీసీపీ శ్రీబాల, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. గణేష్ నిమజ్జనానికి చెరువు వద్ద చేయాల్సిన ఏర్పాట్లు, వసతులపై అధికారులకు సూచనలు చేశారు. గణేశ్ ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. అనంతరం అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులతో పాటు స్టేషన్‌లో వసతులను పరిశీలించారు. వారి వెంట చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, సీఐ మహేశ్, ఎస్‌ఐలు విక్రమ్‌రెడ్డి, సురేశ్, ఏఎస్‌ఐలు షర్ఫోద్దీన్, సిబ్బంది ఉన్నారు.

బీసీలంతా ఏకమైతేనే రాజ్యాధికారం



సమావేశంలో మాట్లాడుతున్న నల్ల లక్ష్మణ్

భూదాన్‌పోచంపల్లి : రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకం కావాలని బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ అన్నారు. గురువారం భూదాన్‌పోచంపల్లిలో నిర్వహించిన బహుజన ప్రజాశక్తి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారం సాధించడం ద్వారానే బీసీల జీవితాలు బాగుపడుతాయన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, సార్వత్రిక ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు ఎక్కువ టికెట్లు కేటాయించాలని కోరారు. భువనగిరి టికెట్ కూడా బీసీలకే కేటాయించాలన్నారు. బీసీలను విస్మరించే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మునునూరి యాదగిరి, చింతకింది రమేశ్, మూశం మధు, జోగు శ్రీనివాస్, కుక్క బాల్‌నర్సింహ, రామకృష్ణ, డబ్బీకార్ హరి, పోవాసపు శ్రీను పాల్గొన్నారు.

వికలాంగుల సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : చౌటుప్పల్‌లో ఈ నెల 12న నిర్వహిస్తున్న వికలాంగుల జాతీయ వేదిక సదస్సును జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ కోరారు. గురువారం పోచంపల్లి, జిబ్లక్‌పల్లి, భీమనపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. వికలాంగులకు పింఛన్, అంత్యోదయ రేషన్‌కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికి ఉచిత విద్యుత్, గృహలక్ష్మి పథకంలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏర్పుల శివయ్య, కార్యదర్శి చుక్క నరేశ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కార్యదర్శి అందె శేఖర్, నాయకులు రామకృష్ణారెడ్డి, సైదులు, శ్రీశైలం, బాలాచారి, రాజు, శ్రీనివాస్, ఐలమ్మ, సత్యనారాయణ, మహేశ్, మైల పరమేశ్, గుండె శ్రీను, పారిజాత పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మోత్కూరు : పట్టణంలోని పాత బస్టాండ్ కూరగాయల మార్కెట్ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడాలని నిరసన తెలిపితే పోలీసులు కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక చెరువు కట్ట చౌరస్తా వద్ద అఖిల పక్ష నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ప్రోద్బలంతోనే 20 మంది అఖిల పక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అధికారులు సైతం ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు.


వరిదే అగ్రస్థానం

2,89,350 ఎకరాల్లో సాగు.. ఆ తర్వాత పత్తి

- జిల్లాలో పూర్తయిన పంటల సర్వే
- 1.72 లక్షల ఎకరాలు సాగు నీటి పథకాల ద్వారా..
- 3.63 లక్షల ఎకరాలు బోర్లు, బావుల కింద సాగు
- వివరాలు యాప్‌లో నమోదు



భువనగిరి శివారులో వరి సాగు



సాక్షి యాదాద్రి : జిల్లాలో రైతులు వరి వైపే అధికంగా మొగ్గుచూపారు. ఈ వానాకాలం 2,89,350 ఎకరాల్లో వరి సాగు చేయగా ఆ తర్వాత పత్తి 99,354 ఎకరాల్లో వేసినట్లు అధికారులు తేల్చారు. జిల్లాలో పంటల సాగు వివరాలు సేకరించేందుకు వ్యవసాయ శాఖ చేపట్టిన సర్వే ముగిసింది. ఏయే పంటలు పండిస్తున్నారు.. దేనిని ఆధారంగా చేసుకొని సాగు చేస్తున్నారు.. తదితర సమగ్ర వివరాలన్నీ సేకరించి ప్రభుత్వానికి నివేదించింది. భవిష్యత్‌లో నష్టాలను అధిగమించి సాగులో ఇబ్బందులు తలెత్తకుండా చేసేందుకు నీటిపారుదల, విద్యుత్ శాఖల సమన్వయంతో చేపట్టిన సర్వేలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు.

వివరాల నమోదు ఇలా..

అధికారులు ప్రతి రైతు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి సర్వే చేశారు. రైతు ఏ సర్వే నంబర్‌లో ఏ పంట వేశాడు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశాడు, రైతు పేరు, భూమి స్వభావం, బోరు, బావి, చెరువు, సాగునీటి పథకాలు, సాగునీటి సౌకర్యం ఉందా లేదా వర్షాధారామా.. వంటి వివరాలు పూర్తిస్థాయిలో సేకరించారు. యాప్‌లో నమోదు చేసి సంబంధిత ఫొటోలను ఫీల్డ్ నుంచే రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపించారు.

మూడు శాఖల ఆధ్వర్యంలో సర్వే

జిల్లాలో 92 క్లస్టర్లలో రైతులు సాగు చేసిన పంటల లెక్క తేల్చేందుకు వ్యవసాయ, నీటి పారుదల, విద్యుత్ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి వివరాలు సేకరించారు. మూడు శాఖల అధికారులు నిర్వహించిన సర్వేలో నీటి పారుదల, వర్షాలపై సాగయ్యే పంటల విస్తీర్ణం నిర్ధారణ అయింది. సాగునీటి పథకాల ద్వారా 1.72 లక్షల ఎకరాలు, వర్షాధారంగా 3.63 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. 516 చెరువుల ద్వారా 17,188 ఎకరాలు, మూసీ కాలువల కింద 41,157 ఎకరాలు, బావుల నీటితో 7,090 ఎకరాలు, 19,077 బోర్ల కింద 86,613 ఎకరాలకు సాగునీరు అందుతున్నట్లు అధికారులు గుర్తించారు. వానకాలంలో వర్షాలపై ఆధారపడి, యాసంగిలో బోర్లు, మూసీ కాల్వలపై ఆధారపడి రైతులు పంటలు పండిస్తారు.

పక్కాగా లెక్కలు



“వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడంతో పాటు రైతులకు ప్రయోజనం కలిగించేలా వ్యవసాయ శాఖ నూతన యాప్ అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో పంటల లెక్కల వివరాలు అసమగ్రంగా ఉండేవి. ఈసారి వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఫీల్డ్‌కు వెళ్లి భూమి, రైతు పేరు, పంటలు, ఎరువులు, పురుగుల మందు వినియోగం వంటి అంశాలు పక్కాగా సేకరించి యాప్‌లో నమోదు చేశాం. రెవెన్యూ గ్రామం యూనిట్‌గా సర్వే కొనసాగింది. ఇప్పుడు సేకరించిన వివరాల ఆధారంగానే పంట నష్టం అంచనా వేయడంతో పాటు నేల స్వభావం, భవిష్యత్‌లో వాతావరణ పరిస్థితులను బట్టి రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా ఏ పంట వేస్తే ప్రయోజనం ఉంటుంది, చీడ, పీడల నివారణకు ఎలాంటి మందులు వాడాలనే దానిపై రైతులకు సమాచారం అందజేస్తాం.

–అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి

4,15,048 ఎకరాల్లో సాగు

జిల్లాలోని 17 మండలాల్లో 2,19,074 మంది రైతులు వివిధ రకాల పంటలు వేశారు. మొత్తం 4,15,048 ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ తన సర్వే ద్వారా లెక్క తేల్చింది. వరి 1,55,671 మంది రైతులు 2,89,325 ఎకరాలు, పత్తి 51,280 మంది రైతులు 99,354 ఎకరాలు, కందులు 2,973 ఎకరాల్లో సాగు చేశారు. మిగతా విస్తీర్ణంలో కూరగాయలు, పండ్ల తోటలు వేసినట్లు గుర్తించారు.

పెరిగిన వరి.. తగ్గిన పత్తి

గడిచిన రెండు, మూడేళ్లుగా జిల్లాలో వరి సాగు గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 24 గంటల విద్యుత్ సరఫరా, సమృద్ధిగా నీటి లభ్యత, మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం వంటి కారణాలతో వరి సాగు ఏటేటా పెరుగుతోంది. అయితే గత వానాకాలంతో పోలిస్తే ఈసారి కొంత తగ్గింది. గతంలో సాగు లెక్కలు అసమగ్రంగా ఉండేవి. కానీ, ఈసారి శాస్త్రీయత పాటించడం వల్ల పక్కాగా నమోదైనందున కొంత వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది. గత వానాకాలంలో 3 లక్షల ఎకరాల్లో వరి వేయగా ఈసారి 2,89,350 ఎకరాల్లో సాగు చేశారు. ఇక ఒకప్పుడు మొదటి స్థానంలో ఉన్న పత్తి తగ్గుతూ వస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడం, తెగుళ్ల బెడద, నకిలీ విత్తనాలతో నష్టాలతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. గత ఏడది 1,11,038 ఎకరాల్లో పత్తి వేయగా ఈ సీజన్‌లో 99,354 ఎకరాల్లో సాగు చేశారు.

మూసీకి వరద పోటు



పొడిచేడు - అమ్మనబోలు మధ్య మూసీ ప్రవాహం

మోత్కూరు : జిల్లాలోని మోత్కూరు మండలం పొడిచేడు, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు మధ్య మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. నాలుగైదు రోజులుగా హైదరాబాద్ జంటనగరాల్లో కురుస్తున్న వర్షాలతో పెద్ద ఎత్తున వరద నీరు చేరుతోంది.ఈ సీజన్‌లో నాలుగైదు పర్యాయాలుగా మూసీ ఉధృతంగా ప్రవహించడంతో నదీ పరీవాహకంలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగి బోర్లు నిండుగా పోస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

నిలిచిన రాకపోకలు

వలిగొండ: మండలంలోని సంగెం సమీపంలో వంతెనపై నుంచి మూసీ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తున్నారు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై ప్రభాకర్ పరిస్థితిని సమీక్షించారు.



సంగెం వద్ద లో లెవల్ బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న మూసీ, పర్యవేక్షిస్తున్న అధికారులు

ప్రణాళిక లేకుండా పనులు!

- హనుమాన్‌వాడలో కూలిన ఇల్లు

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. హనుమాన్‌వాడలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం జేసీబీలతో తవ్వకాలు చేపడుతున్నారు. ప్రణాళిక లేకుండా పనులు చేపడుతుండడంతో భాస్కర్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. కాంట్రాక్ట్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని బాధితులు వాపోయారు. టీపీసీసీ సభ్యుడు రవికుమార్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మాయ దశరథ కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

గోమాతకు పూజలు



యాదాద్రి ఆలయ గోశాలలో గోవుకు పూజలు చేస్తున్న ఈఓ గీతారెడ్డి

యాదగిరిగుట్ట : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలోని మల్లాపురం రోడ్డులో ఉన్న గోశాలలో పూజలు నిర్వహించారు. గోవు నుదుటిపై పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించి పండ్లు తినిపించారు. అనంతరం గోమాత చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అదే విధంగా శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తా

- కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : పార్టీ మారుతున్నట్లు తనపై వస్తున్న వార్తలు అవాస్తవమని, కేసీఆర్ నాయకత్వంలోనే పని చేస్తానని బీఆర్‌ఎస్ నాయకుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌తో కలిసి పనిచేసేందుకే కాంగ్రెస్ పార్టీని వీడానన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని వీడేది లేదని, కార్యకర్తలు గందరగోళానికి గురి కావద్దన్నారు. ఆయన వెంట ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి యాదవ్, నాయకులు ఉన్నారు.

రాష్ట్రం, దేశంలో కాంగ్రెస్‌దే అధికారం

- డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి




భువనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

భువనగిరి టౌన్ : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో రాష్ట్రం, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర గురువారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా భువనగిరిలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఆలోచనలు, భారత్ జోడో సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, పంజాల రామాంజనేయులుగౌడ్ మాట్లాడుతూ..2022 సెప్టెంబర్ 7వ తేదీన రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రను ప్రారంభించారని పేర్కొన్నారు. ఇది దేశంలో మరే నాయకుడు చేయని సుదీర్ఘ పాదయాత్ర అని వెల్లడించారు. ఈ యాత్ర దేశ ప్రజల మనసులో చెరగని ముద్ర వేసిందని, పార్టీలకు అతీతంగా కోట్లాది మంది భారతీయులను ఏకం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్న కోరిక ప్రజల్లోనూ పెరిగిందన్నారు. కాంగ్రెస్ విజయం కోసం పార్టీ శ్రేణులు సమష్టిగా ముందుకెళ్లాలని కోరారు. అంతకుముందు ప్రముఖుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుమ్మల యుగేందర్ రెడ్డి, తంగళ్లపల్లి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తేనే పేదలకు న్యాయం

యాదగిరిగుట్ట : రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం యాదగిరిగుట్టలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ గెలుపునకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్, నాయకులు గుండు నర్సింహగౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, బిట్టు హరీష్, బొజ్జ సాంబేష్, బండారి హరిప్రసాద్, తుమ్మల నాగరాజ పాల్గొన్నారు.



గుట్టలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మనసంతా అటువైపే!

- విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ
- తరగతులపై ఉపాధ్యాయులు దృష్టి కేంద్రీకరించడంలేదని ఆరోపణలు
- బోధనకు ఆటంకం
- బదిలీల కోసం 2,260 మంది దరఖాస్తు



భువనగిరి : వేసవిలో కాకుండా విద్యాసంవత్సరం మధ్యలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడం తరగతులపై ప్రభావం చూపుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు దృష్టంతా అటువైపే కేంద్రీకరిస్తుండడంతో బోధనకు ఆటంకం కలుగుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జూన్ 12నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఇప్పటి వరకు 87 పనిదినాలు కాగా అందులో 58 రోజులు మాత్రమే పాఠశాలలు కొనసాగాయి. ఆదివారాలు, వర్షాలు, ఐచ్ఛిక సెలవుల రూపంలో 28 రోజులు వృథా అయ్యాయి. ఇలాంటి పరిస్థితిలో బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తు చేసుకోవడం మొదలుకొని ప్రక్రియ పూర్తయ్యే వరకు కనీసం నెల రోజులు పట్టే అవకాశం ఉంది. ఈ నెల రోజుల పాటు బోధన సవ్యంగా సాగుతుందనే నమ్మకం లేదు. ఎందుకంటే ఉపాధ్యాయులు భౌతికంగా పాఠశాలకు వచ్చినా మనసంతా బదిలీ ప్రక్రియపైనే ఉంటుంది.

మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో..

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల కోసం ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకోని వారు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.వారంతా మార్పులు, చేర్పులు చేసుకోవడం ఆ తర్వాత మంచి స్థానాలను వెతుక్కోవడం లాంటి కార్యకలాపాలతో సెల్ ఫోన్లకే పరిమితమయ్యే అవకాశం ఉంది. ఎనిమిదేళ్ల దాటిన వారికి తప్పనిసరిగా బదిలీ ఉండబోతుంది. ఎలాగో వెళ్లిపోతామనే బావనతో వీరిలో కొందరు బోధన మమ అనిపించేస్తున్నారు. ప్రభుత్వం గత జనవరిలో బదిలీల షెడ్యుల్ జారీ చేసింది. ఫిబ్రవరి మొదటి వారంలో దరఖాస్తులు స్వీకరించింది. ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులకు పాయింట్లు ఇవ్వడం, జీఓ కూడా అసంపూర్తిగా ఉందనే కారణాలతో పలువురు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. దీని న్యాయస్థానం స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కోర్టు అనుమతి ఇవ్వడంతో తాజాగా ప్రభుత్వం రీ షెడ్యూల్ జారీ చేసింది. దీంతో మళ్లీ బదిలీల సందడి మొదలైనందున పాఠశాలల్లో బోధన సవ్యంగా సాగడం లేదనే అనుమానాలు తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.

15 దరఖాస్తులు తిరస్కరణ

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన గురువారం ముగిసింది. డీఈఓ కార్యాలయంలో ఈనెల 6వ తేదీన దరఖాస్తుల పరిశీలన మొదలైంది. ఏడు బృందాలు పాల్గొని 2,260 దరఖాస్తులను పరిశీలించాయి. ఇందులో 15 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఈ నెల 8,9వ తేదీల్లో అర్హుల జాబితాను ప్రకటించనున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు.

బోధన సవ్యంగానే సాగుతుంది

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలల్లో బోధనకు అటకం ఉండదు. అభ్యంతరాల స్వీకరణ కూడా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. ఉపాధ్యాయులు పాఠశాల నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చి ఇచ్చే దరఖాస్తులు ఏమీ ఉండదు. బోధన సక్రమంగానే సాగుతుంది.

–కె.నారాయణరెడ్డి, డీఈఓ

జిల్లాలో 712 పాఠశాలలు

జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 55,245 మంది విద్యార్థులు ఉన్నారు. 3,108 ఉపాధ్యాయులకు గాను ప్రస్తుతం 2,690 మంది పని చేస్తున్నారు. వీరిలో 2,260 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

యాదాద్రికి తగ్గనున్న విద్యుత్ చార్జీలు

- రాయితీ కల్పించిన ఈఆర్‌సీ
- యూనిట్ రూ.8 నుంచి రూ.5కు తగ్గింపు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విద్యుత్ చార్జీల భారం తగ్గనుంది. యూనిట్ ధరపై రాయితీ కల్పిస్తూ ఈఆర్‌సీ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ ఈఓ గీతారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి ఆలయ అభివృద్ధి, విస్తరణలో భాగంగా పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఆలయ అవసరాలకు విద్యుత్ వాడకం పెరగడంతో ప్రతి నెలా రూ.15లక్షల వరకు బిల్లు వస్తుంది. విద్యుత్ భారం పెరిగిన విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఈఓ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సీఎం స్పందించి తిరుమల తిరుపతి క్షేత్రానికి ఇచ్చిన తరహాలోనే యాదాద్రికి కూడా రాయితీ ఇవ్వాలని ఈఆర్‌సీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈఆర్‌సీ అధికారులు యాదాద్రి దేవస్థానానికి రూ.8కి ఇస్తున్న యూనిట్ ధరను రూ.5కు తగ్గించారని ఈఓ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, ఈఆర్‌సీ ప్రతినిధి రంగారావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు



రామన్నపేట మండలం వెల్లంకిలో మట్టిని సేకరిస్తున్న పీవీ శ్యాంసుందర్‌రావు

రామన్నపేట : అభివృద్ధితో పాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలకు బీజేపీ సర్కార్ ప్రాధాన్యమిస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు తెలిపారు. మేరా మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం రామన్నపేట మండలం వెల్లంకిలో ఇంటింటికి వెళ్లి పార్టీ కార్యకర్తలతో కలిసి మట్టి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులు, ఆర్మీ జవాన్ల సంస్మరణ కోసమే బీజేపీ సర్కార్ ఢిల్లీలో అమృతవాటిక నిర్మాణం చేపడుతుందన్నారు. అమృతవాటిక నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం, దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. అదుకే వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. అనంతరం కూరెళ్ల విఠలాచార్య ఇంటికి వెళ్లి ఆయనను సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు తాటిపాముల శివకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్ల నర్సింగరావు, నకిరేకంటి మొగులయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పోతంశెట్టి రవీందర్, ఏలె చంద్రశేఖర్, పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి, అసెంబ్లీ కో కన్వీనర్ మదూరి ప్రభాకర్‌రావు, యువమోర్చా జిల్లా అధ్యక్షు ఏలూరి శ్యాం, గ్రామ శాఖ అధ్యక్షుడు తాటిపాముల లింగస్వామి, నాయకులు చిక్క బాబురావు, గంజి శ్రీనివాస్, నోముల శ్రీనివాస్, చెరిపల్లి శ్రీకాంత్, ఎన్నం రాజు వనం అంజయ్య, శానగొండ మల్లికార్జున్, పల్లపు దుర్గయ్య, అక్కెనపల్లి సైదులు, బట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ మండలంలో..

వలిగొండ : మండలంలోని ఆరూర్, ఎం.తుర్కపల్లి, లోతుకుంట గ్రామాల్లో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆధ్వర్యంలో అమృతవాటిక నిర్మాణం కోసం మట్టి సేకరించారు. ఈ సందర్భంగా సీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో అరూర్‌కు చెందిన పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. వారిని శ్యాంసుందర్‌రావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ రెడ్డి, పోతంశెట్టి రవీందర్, ఏలే చంద్రశేఖర్, నాగెల్లి సుధాకర్, బందార్సపు లింగస్వామి, దంతూరి సతయ్య, రాచకొండ కృష్ణ, అనీల్ కుమార్, వెంకటేశం,హరీష్, కొత్త రామచంద్రం పాల్గొన్నారు.

క్లుప్తంగా

23, 24న చెవి, ముక్కు వైద్యుల రాష్ట్ర సదస్సు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలో ఈ నెల 23, 24 తేదీల్లో చెవి, ముక్కు వైద్యుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో వైద్యరంగంలో నూతన పరికరాలు, ఆపరేషన్లు, టెక్నాలజీ వంటి వాటిపై సమగ్రంగా చర్చించి నూతన వైద్య ఆవిష్కరణ గురించి తెలుసుకోనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో 33జిల్లాల నుంచి సుమారు 500మంది డాక్టర్లు హాజరవుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రాలు అందించినట్లు తెలిపారు.

గంగమ్మ తల్లి ఆలయంలో చోరీ

డిండి: మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టు సమీపంలో గల గంగమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం గంగమ్మ ఆలయానికి వాచ్‌మెన్ జానయ్య తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి గురువారం ఉదయం వాచ్‌మెన్ ఆలయానికి వచ్చేసరికి ఆలయ ప్రవేశానికి ముందు ఉన్న గేటు(ఇనుప జాలి) తాళం పగులగొట్టి ఉండటం గమనించాడు. వెంటనే ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆలయ కమి టీ సభ్యులు అక్కడకు చేరుకొని పరిసరాలను పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని ధ్వంసం చేసి సుమారు రూ.50వేల నగదు దొంగలించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మూసీ వాగులో పడి వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్: మూసీ వాగులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట మండలంలోని కేటీ అన్నారం గ్రామ శివారులో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బొజ్జ రాంబాబు(32) తన స్నేహితులు, సోదరుడితో కలిసి మూసీ వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. రాంబాబు మూసీ వాగులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. పక్కనే ఉన్న అతడి స్నేహితులు, సోదరుడు కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి రాంబాబుకు ఈత రాకపోవడంతో ఊపిరాడక అప్పటికే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఆర్. సాయిరాం, పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని రాంబాబు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాంబాబు ఇళ్లల్లో బండలు వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి తండ్రి మైసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిరాం తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

నకిరేకల్: పాడి గేదెలు తరలిస్తున్న వాహనాన్ని ఆపి డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో పాటు వాహనం డ్రైవర్‌పై దాడి చేసిన ఐదుగురు వ్యక్తులపై బుధవారం రాత్రి నకిరేకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం నాయకన్‌గూడెం నుంచి హైదరాబాద్ శివారుకు 6 పాడి గేదెలతో వెళ్తున్న మినీ వ్యాన్‌ను బుధవారం రాత్రి నకిరేకల్ శివారులోని నగేష్ హోటల్ సమీపంలో ఐదుగురు వ్యక్తులు ఆపి వాహన డ్రైవర్‌ను రూ.10 వేలు ఇవ్వాలని బెదిరించారు. డ్రైవర్ డబ్బులు ఇవ్వకపోవడంతో అతడిపై దాడి చేసి కొట్టారు. వాహనం డ్రైవర్ వరప్రసాద్ నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

విద్యార్థినుల ఆత్మహత్యపై ముమ్మరంగా దర్యాప్తు

- ఇద్దరు అనుమానితులను విచారిస్తున్న పోలీసులు
- ఫోన్ కాల్ డేటా ఆధారంగా కూపీ..
- ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగ్, డిలీట్ చేసిన వివరాలపై దృష్టి


మనీషా మృతదేహం

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు మనీషా, శివాని ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. నల్లగొండ టూటౌన్ పోలీసులు గురువారం ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి వివరాలు రాబడుతున్నారు. విద్యార్థినుల ఇద్దరి ఫోన్‌లో కాల్ డేటా ఆధారంగా అనుమానితులను విచారిస్తున్నారు. ఎవరితో ఎక్కువగా మాట్లాడారు? వాట్సాప్ చాటింగ్ ఎవరితో ఉంది? మెస్సేజ్‌ల వివరాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బెదిరిస్తున్నాడని.. వాడు ఎవడో తెలియదని ఆ విద్యార్థులు మాట్లాడినట్లు ఫోన్ రికార్డు వైరల్ కావడంతో ఆ దిశగా దర్యాప్తు సాగుతోంది. పరువు పోతుందని ఫోన్‌లో ఏమైనా ఫొటోలు ఉంటే విద్యార్థులు డిలీట్ చేశారా? అనే కోణంలో ఫోన బ్యాకప్‌ను పరిశీలిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన వివరాలను డిలీట్ చేసిన వివరాలను సైబర్ క్రైం విభాగం నుంచి బ్యాకప్ తీసి పరిశీలిస్తున్నారు. విద్యార్థులకు వచ్చిన ఇన్‌కం, అవుట్ గోయింగ్ ఫోన్ కాల్స్ కూడా పరిశీలిస్తున్నారు. నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో బస్సు దిగిన విద్యార్థులు నడుచుకుంటూ ప్రకాశంబజార్‌కు అటునుంచి రాజీవ్‌పార్కులోకి వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తే ఇద్దరు విద్యార్థినులు ఉత్సాహంగా నడుచుకుంటూ వెళ్తూ కనిపించారని పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత పార్కులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించేందుకు సాంకేతికంగా ఉన్న అన్ని ఆధారాలనూ పోలీసులు పరిశీలిస్తున్నారు. లోకేషన్ ఆధారంగా.. ఇద్దరు విద్యార్థులకు ఏ ప్రాంతాల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి? ఆ సమయంలో వీరిద్దరు ఎక్కడ ఉన్నారని ట్రేస్ చేస్తున్నారు.

డీపీలో ఫొటోలు పెట్టుకోవద్దు

నార్కట్‌పల్లి : దర్యాప్తులో భాగంగా పోలీసులు గురువారం విద్యార్థినుల స్వగ్రామాలకు వెళ్లి విచారించారు. నక్కలపల్లి గ్రామంలో శివాని స్నేహితుల నుంచి, అమ్మనబోలు గ్రామానికి మనీషా క్లాస్‌మేట్లు, స్నేహితుల నుంచి పోలీసులు సమాచారం రాబట్టారు. అయితే, అమ్మాయిలు తమ ఇన్‌స్టాగామ్‌లో డీపీగా ఫొటోలు పెట్టుకోవద్దని శివాని గ్రామంలోని స్నేహితులకు చెప్పినట్లు తెలిసింది. ఎందుకు పెట్టుకోవద్దని అడిగితే సమాధానం చెప్పలేదని ఆమె స్నేహితులు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. నక్కలపల్లిలో ఇటీవల ఓ మహిళ ఎస్సై ఉద్యోగం సాధించడంతో.. డిగ్రీ పూర్తి కాగానే మనం కూడా ఎస్సై ఉద్యోగం సాధించాలని ఇద్దరు విద్యార్థినులు నిర్ణయించుకున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నం

- ఆమె కేకలు వేయడంతో పారిపోయిన దుండగుడు


సీసీ కెమెరాల్లో కనిపిస్తున్న బైక్‌పై వెళ్తున్న దుండగుడు

భూదాన్‌పోచంపల్లి: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి గుర్తుతెలియని వ్యక్తి బంగారు పుస్తెలతాడు చోరీ చేసేందుకు యత్నించాడు. ఈ ఘటన గురువారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన చిలుకూరి లక్ష్మమ్మ (65) గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులో పేడ తీసుకురావడానికి రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తుంది. అదే సమయంలో ఆమె వెనుక నుంచి పల్సర్ బైక్‌పై హెల్మెట్ ధరించి వచ్చిన యువకుడు ఆమెను ఆపి చిన్నకొండూరు గ్రామానికి ఎలా వెళ్లాలి అని అడిగాడు. ఆమె సమాధానం చెబుతుండగానే ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాగాడు. అప్రమత్తమైన ఆమె అతని చేతిని గట్టిగా పట్టుకొని ప్రతిఘటిస్తూ బిగ్గరగా కేకలు వేసింది. భయపడిన దుండగుడు గొలుసును వదిలేసి అక్కడ నుంచి మెరుపు వేగంతో దోతిగూడెం మీదుగా చౌటుప్పల్ వైపు పారిపోయాడు. లక్ష్మమ్మ కేకలు విని సమీపంలో ఉన్న కొందరు యువకులు అక్కడికి చేరుకున్నారు. బ్లాక్ కలర్ పల్సర్ బైక్‌పై వచ్చిన దుండగుడు పింక్ కలర్ షర్ట్ వేసుకొన్నాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు..

ఈ విషయం తెలుసుకొన్న చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, ఎస్ఐ విక్రమ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులను అప్రమత్తం చేసి పోచంపల్లి, దోతిగూడెం వైపు వెళ్లే మార్గాలలో వాహనాల తనిఖీ చేపట్టారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలతో పాటు గ్రామ సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితుడు దోతిగూడెం మీదుగా కొయ్యలగూడెం వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. అయితే బైక్ నంబర్ మాత్రం స్పష్టంగా కన్పించలేదు. దుండగుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

భువనగిరి: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విక్రమ్ పటేల్(23) బస్వాపురం రిజర్వాయర్‌కు సంబంధించి పీఎల్ఆర్ ప్రాజెక్టులో సర్వేయర్ కింద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామ పరిధిలో విక్రమ్ పటేల్ కాల్వ సర్వే చేస్తుండగా.. ఇనుప కొలబద్ద అక్కడే ఉన్న కరెంట్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపారు.

రెండు గొర్రెలు..

గుండాల: మండలంలోని పెద్దపడిశాలలో గురువారం విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతిచెందాయి. వివరాలు.. పెద్దపడిశాలకి చెందిన రావుల అంజిరాజు గొర్రెలను మేత కోసం తీసుకెళ్తుండగా.. గ్రామంలోని బొడ్రాయి సమీపంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ స్టే వైరుకు తగిలిన రెండు గొర్రెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.15వేల నష్టం వాటిల్లిందని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే తన గొర్రెలు మృతి చెందాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి


ఘటనా స్థలంలో యాదమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త ముత్యాలు


ప్రమాదానికి కారణమైన లారీ ఇదే..

- బాలుడు లారీ నడపడంతో ఘటన

భూదాన్‌పోచంపల్లి: బాలుడు లారీని నిర్లక్ష్యంగా నడిపి వృద్ధురాలి ప్రాణాలను బలిగొన్నాడు. ఈ ఘటన గురువారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో జరిగింది. మృతురాలి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిలాయిపల్లి గ్రామానికి చెందిన బత్తుల యాదమ్మ(69) గురువారం ఉదయం ఇంటి బయట ఊడుస్తుండగా.. అదే సమయంలో ఆమె ఇంటి సమీపంలో ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద లారీని డ్రైవర్ ఆపి టిఫిన్ పార్సిల్ తీసుకున్నాడు. అనంతరం లారీ ఎక్కి ముందున్న యాదమ్మను గమనించక వేగంగా ముందుకు పోనిచ్చాడు. దీంతో లారీ యాదమ్మ కాళ్ల మీదుగా వెళ్లి, వెనుక చక్రాలు నడుము మీదుగా వెళ్లడంతో ఆమె అక్కడక్కమే మృతిచెందింది. అయితే అక్కడే ఉన్న యాదమ్మ పెద్ద కుమారుడు జంగయ్య గమనించి లారీని ఆపమని కేకలు వేయడంతో డ్రైవర్ లారీని ఆపాడు.

బాలుడు.. లారీ డ్రైవర్

లారీ ఓనర్ వీరేశ్‌ది బొమ్మలరామారం మండలం పేరారం గ్రామం కాగా.. అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు ఘటన జరిగిన సమయంలో లారీని నడిపినట్లు తెలిసింది. మైనర్ బాలుడికి డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా హెవీ వెహికిల్ డ్రైవర్‌గా పెట్టుకోవడం విస్మయాన్ని కల్గిస్తుంది. వీరిద్దరి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి అయ్యిందని మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకొన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త ముత్యాలు, వివాహితులైన నలుగురు కుమారులు ఉండగా.. అందులో ఒకరు మృతి చెందాడు. మృతురాలి కుమారుడు జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోచంపల్లి ఎస్ఐ సురేశ్ తెలిపారు.

రూ.5లక్షలకు ఒప్పందం..?

యాదమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు నిరసన తెలిపారు. మైనర్‌తో పాటు లారీని విడిచిపెట్టమని తేల్చిచెప్పారు. దీంతో పెద్ద మనుషులు కూర్చొని మృతురాలి కుటుంబానికి రూ.5లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిర్చినట్లు తెలిసింది.

ఎదురెదురుగా రెండు బైకులు ఢీ..

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో శ్రీకాంత్ మృతదేహం

కేతేపల్లి: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం సమీపంలో గురువారం రాత్రి విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన కలకుంట్ల శ్రీకాంత్(40) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సూర్యాపేటలో తన బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యేందుకు శ్రీకాంత్ గురువారం రాత్రి బైక్‌పై హైదరాబాద్ నుంచి బయల్దేరాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం సమీపంలోకి చేరుకోగానే సూర్యాపేట వైపు నుంచి ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న మరో బైక్ శ్రీకాంత్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బైక్‌పై ప్రయాణిస్తున్న కేతేపల్లి మండలంలోని కొత్తపేటకు చెందిన రంపికుంట్ల బ్రహ్మచారికి తీవ్రగాయాలు కాగా అతడి భార్య వరలక్ష్మి స్వల్పంగా గాయపడింది. సమాచారం అందుకున్న కేతేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

మట్టపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు


పూజలు చేస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం సాయంత్రం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయంలో శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, విశేషపూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, మహదేవశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యం

- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్


మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

గరిడేపల్లి: అవినీతి లేని సమ సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం గరిడేపల్లి మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో నిర్వహించిన సీపీఐ గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే తమ బతుకులు మారుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉద్యమించి, 1400 మంది ఆత్మబలిదానంతో సాధించుకున్న తెలంగాణ నేడు ఒక కుటుంబం బాగుపడేందుకు ఉపయోగపడుతుందన్నారు. అబద్ధపు మాటలతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ మరోసారి మోసం చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పాలక ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కడియాల అప్పయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు, సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, మహిళా సమాచార్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సీపీఐ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, కందుకూరి వెంకట్‌రెడ్డి, రావుల సత్యం, అంబటి వెంకట్‌రెడ్డి, దైద ఏసు పాదం, మాతంగి వెంకన్న తదితరులున్నారు.

రాహుల్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి తదితరులు

కోదాడ: దేశ సమైక్యతకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి దిగ్విజయంగా ముగించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని వచ్చే ఎన్నికల్లో విజయం దిశగా సాగుదామని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ భారత జోడో యాత్ర చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం కోదాడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయం నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్డులోని ఇందిరాచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ దేశ సమైక్యతను కాపాడేందుకు రాహుల్ గాంధీ ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ యాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించనుందని, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, డేగ శ్రీధర్, నిరంజన్‌రెడ్డి, గరిణె శ్రీధర్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేస్తేనే అధికారం సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ మానే
- నకిరేకల్, మునుగోడు మండలం కొంపల్లిలో కార్యకర్తల సమావేశాలు


మునుగోడు: కొంపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాస్ మానే

నకిరేకల్/మునుగోడు: రానున్న మూడు నెలలు ఎంతో కీలకమని, ఈ మూడు నెలలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తేనే తెలంగాణలో అధికారంలోకి రావడం సాధ్యమని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే శ్రీనివాస్ మానే అన్నారు. గురువారం నకిరేకల్, మునుగోడు మండలం కొంపల్లిలో వేర్వేరుగా నిర్వహించిన పార్టీ బూత్‌స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో సామాన్య ప్రజలకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు అందించనున్న ఐదు ప్రధాన సంక్షేమ పథకాల మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని కోరారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అక్కడ ఆసరా పెన్షన్లు రూ.4వేలు, రూ.500లకు వంట గ్యాస్, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి పేదలకు రూ.6లక్షలు, ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షల చొప్పున అందిస్తుందన్నారు. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో అందించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైయిందన్నారు. వీటిని ప్రజలకు తెలియచేసేందుకు కార్యకర్తలు ప్రతి ఇంటికి కనీసం పదిసార్లు వెళ్లి వివరించాలన్నారు. నకిరేకల్, మునుగోడులో ఎమ్మెల్యే టికెట్లు ఎవరికిచ్చినా అందరు కలసికట్టుగా పనిచేసి అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని సూచించారు. సమష్టిగా పనిచేస్తామని నకిరేకల్ టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ప్రకటించారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాపోలు జయప్రకాష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కొండేటి మల్లయ్య, చెలమల్ల కృష్ణారెడ్డి, పున్న, కైలాస్ నేత, అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతిరెడ్డి, ఆయా నియోజకవర్గాల నాయకులు దైద రవీందర్, నలగాటి ప్రసన్నరాజ్, నకిరేకంటి ఏసుపాదం, చామల శ్రీనివాస్, సుంకర బోయిన నర్సింహ, బోళ్ల వెంకట్‌రెడ్డి, యాసా కరుణాకర్‌రెడ్డి, గాజుల సుకన్య, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, జలందర్‌రెడ్డి, వెదిర మేఘారెడ్డి, సురిగి నర్సింహగౌడ్, మేకల ప్రదీప్‌రెడ్డి, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, కందుల సూర్యప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీని నియమించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

సూర్యాపేటటౌన్: రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించిన రెండో పీఆర్సీ కమిటీని నియమించి వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ఊరు -మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం, వాటి రక్షణ, పరిశుభ్రతకు సర్వీస్ పర్సన్‌ను నియమించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు, నాయకులు సోమయ్య, అనిల్ కుమార్, యాకయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటయ్య, వెంకన్న, దామోదర్, రవీందర్, పాపి రెడ్డి, నాగేశ్వరరావు, ఆడమ్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లను ముందుగా గుర్తించాలి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు


డాక్టర్ శ్రీనివాసరావు



త్రిపురారం: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో వరి పంటను సాగు చేసిన ప్రాంతాలలో వాతావరణ మార్పులకు అనుగుణంగా వచ్చే చీడపీడలను రైతులు సరైన సమయంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లేదంటే దిగుబడులు తగ్గి ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. వరి పంటకు సోకే చీడపీడల నివారణకు జిల్లాలోని రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆయన సూచించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

పాడి పంట

వరిలో అగ్గి తెగులు..

నీరు సరైన సమయానికి అందించకపోవడం వల్ల వరిలో అక్కడక్కడ వచ్చే అగ్గి తెగులును సరైన సమయంలో గుర్తించి ట్రైసైక్లోజోల్ 1.6 గ్రాములు లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. నత్రజని ఎరువులను తగ్గించుకొని, పొలం గట్లపై ఉన్న కలుపును తీసివేయాలి.

కాండం కుళ్లు తెగులు

వరి పంటలో కాండం కుళ్లు తెగులు నివారణకు 2 మి.లీ. హెక్సాకోనాజోల్ లేదా 1 గ్రాము కార్బండిజమ్ లేదా 1 మి.లీ. టేబుకోనాజోల్‌ను 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు వరి పిలకల కింద వరకు తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.

ఆకు ముడత తెగులు

వరిలో ఆకు ముడత తెగులు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఉల్లికోడు తెగులు

వరిలో ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లికోడు తెగులు ఎక్కువగా ఆశిస్తున్నందున దీని నివారణకు నాటిన 10 నుంచి 15 రోజుల కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా ఫోరేట్ గుళికలు 5 కిలోలు ఎకరాకు లేదా ఫిప్రోనిల్ 2.5 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

మొగి పురుగు లేదా కాండ తొలుచు పురుగు

వరి పంటలో వాతావరణ పరిస్థితులను బట్టి కాండం తొలుచు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2గ్రాములు లేదా 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిపోల్ 18.5 ఎస్‌పీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.